కనుల పండుగగా ధనుర్మాస మహోత్సవాలు

మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ టీఎన్‌జీవోస్ కాలనీలోని శ్రీ వెంకన్నగుట్ట వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ధనుర్మాస మహోత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. తెల్లవారుజామున దేవాలయంలో గోదా అమ్మవారికి విశేషమైన పూజలు, అలంకరణలు, అమ్మవారి పల్లకీ సేవలు కనుల పండుగగా నిర్వహించారు. దేవాలయాన్ని వివిధ రకాల పూలతో అందంగా ముస్తాబు చేశారు.– మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 22:

పీరంచెరువు ఎమ్మార్పీఎస్ కమిటీ ఎన్నిక



పీరంచెరువు గ్రామ ఎమ్మార్పీఎస్ కమిటీ అధ్యక్షులు డప్పు అరుణ్‌మాదిగకు నియామక పత్రం అందజేస్తున్న గణేష్‌మాదిగ

బండ్లగూడ, డిసెంబర్ 22: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్లగారి గణేష్‌మాదిగ అన్నారు. ఆయన అధ్యక్షతన ఆదివారం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీరంచెరువులో నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు.
అధ్యక్షుడిగా డప్పు అరుణ్‌మాదిగ, అధికార ప్రతినిధిగా వినోద్‌కుమార్‌మాదిగ, ఉపాధ్యక్షులుగా నర్సింహమాదిగ, ప్రధాన కార్యదర్శిగా జె.అశోక్‌మాదిగ, కార్యదర్శిగా రాజేష్‌మాదిగ, కోశాధికారిగా డి.నరేష్‌మాదిగ, ప్రచార కార్యదర్శిగా డప్పు కళ్యాణ్‌మాదిగ, కార్యవర్గ సభ్యులుగా బాబూరావుమాదిగ, మల్లేష్‌మాదిగ, సురేష్‌మాదిగ, బొయిన్‌మాదిగలను ఎన్నుకున్నారు.

ప్రభుత్వ స్థలాన్ని కాపాడండి

వెంకటేశ్వరకాలనీ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరకాలనీ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి

బంజారాహిల్స్,డిసెంబర్ 22: బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 10లోని జలమండలి కార్యాలయాన్ని ఆనుకుని ప్రభుత్వ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించుకున్నారని, వెంటనే ఉన్న తాధికారులు జోక్యం చేసుకుని ఆ స్థలాన్ని కాపాడాలని వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని తన నివాసంలో మీడియా సమావేశంలో కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి మాట్లాడుతూ..వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోకి వచ్చే తట్టిఖానా జలమండలి సెక్షన్ పక్కన ఉన్న రెవెన్యూ స్థలంలో ప్రైవేటు వ్యక్తులు ఫెన్సింగ్ వేసుకున్నారని దానిపై కొంతకాలంగా ఫిర్యాదులు చేస్తున్నామన్నారు. అయితే ఆ స్థలంలో నుంచి కబ్జాదారులను తొలగించే ప్రయత్నం చేయకుండా వారికి సహకరించేలా అధికారుల వ్యవహారం కనిపిస్తోందన్నారు. స్థానికుల అవసరాల కోసం ప్రసూతి ఆస్పత్రి నిర్మాణం కోసం ఈ ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు. వెంటనే ఈ స్థలంలో తిష్టవేసిన వ్యక్తులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ స్థలంలో ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోతే డివిజన్ ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంటుందని హెచ్చరించారు.

బీఆర్ఎస్ హయాంలో ..పేదలకు పండుగ

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో క్రమం తప్పకుండా అన్ని మతాల పండుగలకు ప్రభుత్వం తరపున కానుకలు అందించేవారని, ఏడాది కాలంగా ప్రస్తుత ప్రభుత్వంలో కానుకలు నిలిపివేయడం బాధాకరమని వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి అన్నారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 14లోని స్టడీ సర్కిల్ సమీపంలోని బాప్టిస్ట్ చర్చిలో ఆదివారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన కార్పొరేటర్ కేక్ కట్ చేసిన అనంతరం మాట్లాడుతూ.. పేదలందరికీ పండుగల ఆనందాన్ని పంచాలన్న లక్ష్యంతో బతుకమ్మ చీరలు, రంజాన్ తోఫాలు, క్రిస్మస్ కానుకలను కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చేదని గుర్తుచేశారు. అయితే ఇప్పుడున్న ప్రభుత్వంలో పేదలకు నిరాశే మిగులుతోందన్నారు.

కళింగభవన్‌లో.. హస్తకళా ప్రదర్శన ప్రారంభం

బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12లోని కళింగ కల్చరల్ సెంటర్‌లో జాతీయ చేనేత హస్తకళా ప్రదర్శన ఆదివారం ప్రారంభమైంది. హస్తకళ ఆర్టిషన్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు శ్రీదేవి విజయదాస్ ఈ ప్రదర్శనను ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ..భారతీయ సంస్కృతిలో పట్టు హ్యాండ్‌లూమ్స్ ఉత్పత్తులకు ఎంతో ప్రత్యేక స్థానం ఉందన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన చేనేత కారులు, హస్త కళాకారులు రూపొందించిన ఉత్పత్తులను ప్రదర్శనలో అందుబాటులో ఉంచారు. ఈ నెల 29వరకు ఈ ప్రదర్శన కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. – బంజారాహిల్స్,డిసెంబర్ 22:

హక్కుల కోసం కలిసికట్టుగా ఉద్యమించాలి

మహా సభకు ర్యాలీగా వెళ్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 22: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొడుతూ తమ హక్కులను సాధించుకునేందుకు కలిసికట్టుగా ఉద్యమించాలని సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్ వెస్లీ, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.చంద్రమోహన్‌లు పిలుపునిచ్చారు. కాటేదాన్‌లోని కార్యాలయంలో సీపీఎం పార్టీ రాజేంద్రనగర్ మండల రెండో మహా సభ కామ్రేడ్ బి.చిట్టెమ్మ ప్రాంగణం పేరుతో నిర్వహించారు. ఈ మహా సభలకు సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్ వెస్లీ, రంగారెడ్డి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.చంద్రమోహన్‌లు మాట్లాడుతూ దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తూ ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తుందన్నారు. పేద, మధ్య తరగతి ప్రజల జీవితాలతో ఆటలాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు ఇవ్వడం లేదన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అమలు చేయకుండా దేశంలో కులమత బేధాలు రెచ్చగొడుతూ దేశాభివృద్ధిని గాలికి వదిలేయడం జరిగిందన్నారు. పార్లమెంట్ సాక్షిగా అమిత్‌షా డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవహేళన చేస్తూ మాట్లాడడం సరికాదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు కాంగ్రెస్ మాటలు నమ్మి అధికారం అప్పజెబితే ఇచ్చిన హామీలను అమలు చేయక కాలయాపన చేస్తుందన్నారు.

సీపీఎం పార్టీ మండల కమిటీ ఎన్నిక...

కాటేదాన్‌లోని సీపీఎం పార్టీ కార్యాలయంలో ఆదివారం రాజేంద్రనగర్ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా జాజాల రుద్ర కుమార్, మండల కమిటీ సభ్యులుగా జి.ఎం.కురుమయ్య, జి.ఎం.గట్టయ్య, ఎస్.రామోహ్మన్‌రావు, ఎన్.జంగయ్య, ఎస్.మోహన్, భాస్కర్, కాలే రాజు, బచ్చలకూర స్వామి, సువార్త, మణెమ్మ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

హామీలు అమలు చేయాలి

హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో నిర్వహించిన మహాసభలో మాట్లాడుతున్న బాల్‌రాజ్, పాల్గొన్న మధ్యాహ్న భోజన పథకం నాయకులు

హిమాయత్‌నగర్,డిసెంబర్ 22 : రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకంలో పనిచేసే కార్మికులు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్ రాజ్, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ డిమాండ్ చేశారు.ఆదివారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం యూనియన్ నిర్మాణ మహాసభలు జరిగాయి. యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.ప్రేంపావని అధ్యక్షతన జరిగిన సమావేశానికి వారు హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కార్మికులకు ఇచ్చిన హామీలను విస్మరించిందని ఆరోపించారు.ఈ పథకంలో సుమారు 54వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని వీరికి కనీస వేతనం నెలకు రూ.10వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.కోడి గుడ్లు, వంట గ్యాస్,సరుకులను ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. ఈ సమావేశంలో యూనియన్ నేతలు రాములు,చక్రపాణి, పూసల రమేష్,సుగుణ,జంపాల రవీందర్, విజయలక్ష్మి,రామకృష్ణ,రాంమూర్తి ముంతాజ్‌బేగం, రామస్వామి,బోయిన ప్రసాద్, రమేష్,వెంకటేశ్,లక్ష్మణ్,రజిత పాల్గొన్నారు.

గణితం పోటీ పరీక్షలో ప్రభుత్వ విద్యార్థి సత్తా

రాష్ట్ర స్థాయి గణిత ప్రతిభా పరీక్షలో రెండో బహుమతి అందుకుంటున్న విద్యార్థి పి.కార్తీక్

మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 22: విద్యార్థులు గణితంను అర్థం చేసుకుంటే సులభంగా రాణించగలరని గణేష్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు మాధవి, ఉపాధ్యాయుడు మాణిక్యంరెడ్డిలు అన్నారు. తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో హయాత్‌నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి గణిత ప్రతిభా పరీక్ష–2024ను ఆదివారం నిర్వహించారు. ఈ పోటీల్లో గణేష్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి పి.కార్తీక్ ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రంలోనే రెండవ స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా నిర్వాహకులు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం కార్తీక్‌ను అభినందించి రానున్న రోజుల్లో మరిన్ని పోటీ పరీక్షల్లో రాణించాలని సూచించారు.

తల్లిదండ్రుల కమిటీలు ఏర్పాటు చేయాలి

హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న షేక్ మహబూబ్ అలీ

హిమాయత్‌నగర్,డిసెంబర్22: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పేరెంట్స్ కమిటీలను ఏర్పాటు చేసేందుకు చొరవ తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర పేరెంట్స్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ మహబూబ్ అలీ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఆదివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూల్స్‌లో నిర్వహణ కొరవడం, నాణ్యమైన ఆహారం అందించకపోవడం వల్ల తరుచూ విద్యార్థులు అనారోగ్యాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.డ్రాప్ అవుట్‌కు అడ్డుకట్ట వేయడం వల్ల విద్యా వ్యవస్థ బలోపేతం అవుతుందన్నారు.డ్రగ్స్,మత్తు పదార్థాల బారిన విద్యార్థులు పడకుండా ఉండేందుకు అవగాహన కల్పించాలన్నారు.ఈ సమావేశంలో కమిటీ కోశాధికారి డాక్టర్ షేక్ మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కుట్టుమిషన్ల కోసం దరఖాస్తుల స్వీకరణ

బేగంపేట్, డిసెంబర్ 22: బేగంపేట్ పాటిగడ్డ, ఓల్డ్ కస్టమ్స్ బస్తీల్లో మైనారిటీలకు ఉచిత కుట్టు మిషన్ యంత్రాల పంపిణీ కోసం దరఖాస్తుల స్వీకరణ శిబిరం ఆదివారం ఏర్పాటు చేశారు. ఉచితంగా పొందడానికి అవసరమైన ఆన్‌లైన్ దరఖాస్తులను అందజేశారు. డిసెంబర్ 31వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను పూర్తి చేయాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సనత్‌నగర్ ఇన్‌చార్జి కోట నీలిమా, స్థానిక నాయకులు విశాల్ సుదం, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పీవీ రావు త్యాగాలు వెలకట్టలేనివి

అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న చెన్నయ్య తదితరులు

ఖైరతాబాద్, డిసెంబర్ 22 : మాల మహానాడు వ్యవస్థాపకులు పీవీ రావు బడుగు, బలహీనవర్గాల కోసం చేసిన త్యాగాలు వెలకట్టలేనివని ఆ సంఘం జాతీయ అధ్యక్షులు జి. చెన్నయ్య అన్నారు. పీవీ రావు, దివంగత బడుగుల నేత జి. వెంకటస్వామి వర్ధంతి సభ ఖైరతాబాద్ మింట్ కాంపౌండ్‌లోని అంబేద్కర్ స్ఫూర్తి భవన్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన చెన్నయ్య మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత స్ఫూర్తిని ముందు తరాల వారికి అందించేందుకు దివంగత నేతలు ఎనలేని కృషి చేశారన్నారు. వారి కృషి ఫలితంగానే రాజ్యాంగ ఫలాలు దళితులకు దక్కుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు బూర్గుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పీవీ రావు వర్ధంతి సందర్భంగా..

ఎర్రగడ్డ: అంబేద్కర్ విగ్రహ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పీవీ రావు వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. మోతీనగర్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు పీవీ రావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విగ్రహ పరిరక్షణ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదగిరి, బోరబండ డివిజన్ అధ్యక్షుడు బొట్టుశివ, దశరథం, తిరుపతి, సంపత్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

తైక్వాండోలో రాణించిన విద్యార్థులకు వివిధ రకాల బెల్టులను బహూకరించిన దృశ్యం

ఆత్మరక్షణకు తైక్వాండో నేర్చుకోవాలి

మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 22: విద్యార్థులు ఆత్మరక్షణ కోసం తైక్వాండో నేర్చుకోవాలని తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏ.ప్రవీణ్‌కుమార్ సూచించారు. అత్తాపూర్‌లోని టెంపుల్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్‌లో తైక్వాండో కలర్ బెల్ట్ ప్రమోషన్ టెస్ట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చీఫ్ ఎగ్జామినర్‌గా ఏ.ప్రవీణ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయస్సుతో సంబంధం లేకుండా ఈ తైక్వాండోను నేర్చుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా కోచ్‌లు ఎస్.ప్రదీప్‌కుమార్, బి.సురేష్‌లను ఆయన అభినందించారు. అనంతరం విద్యార్థులకు కలర్ బెల్టులను బహూకరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్స్ వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్‌లో రైల్వే జట్టు విజేత

బొల్లారం, డిసెంబర్ 22: బొల్లారం కంటోన్మెంట్ పబ్లిక్ గార్డెన్‌లో ఆదివారం బొల్లారం బాల్ బ్యాడ్మింటన్ క్లబ్ ఆధ్వర్యంలో అర్జుమన్ రావు జ్ఞాపకార్థంగా బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహించారు. పోటీల్లో 12 జట్లు పాల్గొనగా రైల్వే జట్టు విజేతగా నిలిచింది. కార్యక్రమంలో అధ్యక్షుడు జైహింద్ రెడ్డి, వైస్‌ప్రెసిడెంట్ ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి ఎంబీ అనంత్ నారాయణ్, జాయింట్ సెక్రటరీ సుశీల్ కుమారక్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్వీ రమేశ్‌కుమార్, కోశాధికారి రమేశ్ పాల్గొన్నారు.

అసమానతలను రూపుమాపేందుకు కృషి

హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో జరిగిన సభలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

హిమాయత్‌నగర్, డిసెంబర్ 22: సమాజంలో నెలకొన్న అసమానతలను రూపుమాపేందుకు ప్రజల పక్షాన నిలబడి సీపీఐ నిరంతరం పోరాటాలు చేస్తుందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. సీపీఐ శత వసంతాల సందర్భంగా ఆదివారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో తెలంగాణ ప్రజా నాట్యమండలి,అభ్యుదయ రచయితల సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి వర్క్‌షాపు జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా,తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాలలో సీపీఐ కీలకపాత్ర పోషించిందని తెలిపారు.ఈ నెల 30న నల్గొండ జిల్లా కేంద్రంలో జరిగే సీపీఐ శత వసంతాల సంబరాల సభకు ప్రజలు అధిక సంఖ్యల్లో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈ.టీ.నరసింహ, కలవేణి శంకర్,ఎం.బాలనరసింహ, ప్రజా నాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి అమిత్‌షా క్షమాపణ చెప్పాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

హిమాయత్‌నగర్‌లోని మఖ్దూం భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న బాలనరసింహ

రేపు నగరంలో భారీ ధర్నా

ఖైరతాబాద్, డిసెంబర్ 22 : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షా బేషరతుగా క్షమాపణ చెప్పాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. డాక్టర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగ ఫలాలతో నేడు పార్లమెంట్‌లో పదువులు అనుభవిస్తున్నారని, ఆయనపై అనుచిత వ్యాఖ్యలు చేయడం విచారకరమన్నారు. గతంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం అంబేద్కర్‌ను కించపరిచిందని, చరిత్ర పుటల్లో ఆయన చరిత్ర లేకుండా చేయాలని కుట్ర జేసిందన్నారు. అమిత్ షా వ్యాఖ్యలను నిరసిస్తూ ఈ నెల 24న నగరంలో భారీ ధర్నా చేపట్టనున్నామని తెలిపారు. ఈ సమావేశంలో బీఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ బి. ఈశ్వర బడంగ్‌పేట డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ చరిత్రను వక్రీకరించేందుకు కేంద్రం కుట్ర

హిమాయత్‌నగర్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చరిత్రను వక్రీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాల నరసింహ ఆరోపించారు.ఆదివారం హిమాయత్‌నగర్‌లోని మఖ్దూం భవన్‌లో డీహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధి కారంలోకి వచ్చిన నాటి నుంచి మను ధర్మశాస్త్ర విధానాలను అమలు చేసేందుకు ప్రయత్నిస్తుందన్నారు. 2025 జనవరి 5నుంచి 7 వరకు ఖైరతాబాద్‌లోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య భవన్‌లో జరిగే ఏఐడీఆర్ఎం 2వ జాతీయ మహాసభలకు దళితులు అధిక సంఖ్యల్లో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.ఈ సమావేశంలో డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కె.యేసురత్నం,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్,రాష్ట్ర నేతలు ఆరుట్ల రాజ్ కుమార్, కుమార్,టి.రామకృష్ణ,వెంకటస్వామి,లక్ష్మీపతి,రాజరత్నం పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి మహా పడిపూజ

అయ్యప్పస్వామి మహాపడిపూజ ఆదివారం శంషాబాద్ మున్సిపాలిటీలోని రాళ్లగూడలో రమేష్‌నాయక్ స్వామి నిర్వహించిన పూజకు బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి హాజరై అయ్యప్పస్వామి ఆశీస్సులు తీసుకున్నారు. పూజలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ డైరక్టర్ బుర్కుంట సతీష్, మంచర్ల శ్రీనివాస్, పార్టీ ప్రధాన కార్యదర్శి మోహన్‌రావు, లీగల్‌సెల్ అధ్యక్షుడు శ్రీనివాస్, రాజేందర్, గుంటిచరణ్,హన్మంతు, లింగం శ్రీశైలం, జంగరావు పాల్గొన్నారు. – శంషాబాద్ రూరల్

సహకార సంఘాలు.. సేవాభావంతో పని చేయాలి

సమావేశంలో సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతున్న సొసైటీ అధ్యక్షుడు యూసుఫుద్దీన్

ఎర్రగడ్డ, డిసెంబర్ 22: సహకార సంఘాల చట్టాలకు అనుగుణంగా ముందుకు వెళ్తూ సభ్యులకు చేరువ కావాలని కోఆపరేటివ్ సహాయక రిజిస్ట్రార్ భీమ్‌రాజ్ పేర్కొన్నారు. బోరబండకు చెందిన ఎన్ఆర్ఆర్ పురం కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశం ఆదివారం స్థానిక ప్రొఫెసర్ జయశంకర్ కమ్యూనిటీహాల్లో జరిగింది. ఈ సమావేశానికి పరిశీలకులుగా విచ్చేసిన భీమ్‌రాజ్ మాట్లాడుతూ ఎన్ఆర్ఆర్ పురం హౌసింగ్ సొసైటీకి సుమారు 50 ఏండ్ల చరిత్ర ఉన్నదని.. సభ్యుల సంపూర్ణ సహకారంతో పాలక మండలి ఎన్నో సంచలన నిర్ణయాలు తీసుకుని అభివృద్ధి దిశగా పయనిస్తున్నదని ప్రశంసించారు. సొసైటీ పాలక మండలి అధ్యక్షుడు షేక్ యూసుఫుద్దీన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ నాల్గో తరగతి ఉద్యోగులకు గృహ వసతి కల్పించే అంశంలో భాగంగా 1976లో ఈ సొసైటీ ఆవిర్భవించిందని.. సుమారు 61 ఎకరాల్లో సభ్యులకు ఇండ్ల స్థలాలను కేటాయించారన్నారు. సొసైటీకి చెందిన ఇండ్ల థర్డ్ పార్టీ రిజిస్ట్రేషన్ అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉన్నదన్నారు. సమావేశంలో సొసైటీ కార్యదర్శి ఇమామ్‌ఘోరి, ఉపాధ్యక్షుడు ఈలయ్య, కోశాధికారి సి.సత్యనారాయణ, సభ్యులు అక్తర్‌సుల్తానా, అమృత, రామ్మోహన్‌రావు, అహ్మద్‌అలీ, సత్తాజీ, సాయినాథ రావు, రహ్మాన్, సూపర్‌వైజరీ కౌన్సిల్ మెంబర్స్ దేవరాజ్, కలీముద్దీన్, వేణుగోపాల్‌సింగ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముషీరాబాద్, డిసెంబర్ 22: టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఆజామాబాద్ డివిజన్ 11కేవీ విద్యానగర్, డీడీహెచ్, నల్లకుంట ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతు కారణంగా సోమవారం (నేడు) విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆజామాబాద్ డివిజన్ ఏడీఈ జీ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

ఆహ్లాదంగా.. వింటర్ ఉత్సవ్ మేళా..!

నెక్లెస్‌రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో ఏర్పాటు చేసిన కశ్మీర్ వింటర్ ఉత్సవ్ మేళా ఆకట్టుకుంటున్నది. క్రిస్మస్ సందర్భాన్ని పురస్కరించుకొని శాంతాక్లాజ్ వేషధారణలో వచ్చే సందర్శకులకు ప్రత్యేక గిఫ్టులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.– ఖైరతాబాద్, డిసెంబర్ 22

ఆపత్కాలంలో ఆర్థిక చేయూత: పేదలకు ఆపత్కాలంలో సీఎం రిలీఫ్ ఫండ్ ఆర్థిక చేయూత అందిస్తుందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. ఆదివారం గోల్కొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 23 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ నుంచి మంజూరైన రూ.7.54 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనారోగ్యానికి గురై దవాఖానల్లో చికిత్స పొందుతున్న అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి సాయం అందజేస్తున్నామన్నారు. –గోల్కొండ